ఖైరతాబాద్‌లో అందని వైద్యం

సరిపడా లేని వైద్యులు, నర్సులు

అత్యవసర కేసులు వస్తే ఇతర ఆస్పత్రులకు సిఫార్సు

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఆరోగ్య శాఖ

ఖైరతాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): 'ఆరోగ్య కేంద్రంలో విడతల వారీగా అన్ని సదుపాయాలు కల్పిస్తాం.. సిటి స్కాన్‌తో పాటు ఎంఆర్‌ఐ పరీక్షలు సైతం ఇక్కడే జరిగేలా ఆస్పత్రిని అభివృద్ధి చేస్తాం' మని ఇక్కడి ప్రజాప్రతినిధులు హామీలు గుప్పించారు. ఈ మాట దేవుడెరుగు కనీసం ఆస్పత్రిలో సరిపడా డాక్టర్లను, నర్సులను నియమించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సరిపడా వైద్యులు లేక ఈ ఆస్పత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా తగ్గుతూ వస్తోంది. దీనిని ఆసరాగా చేసుకొని ఆరోగ్య శాఖ అధికారులు ఇక్కడున్న సిబ్బందిని డిప్యూటేషన్లపై బయటకు పంపుతున్నారు.



ఖైరతాబాద్‌లోని 50 పడకల ఆరోగ్య కేంద్రం

వైద్యులు, స్టాఫ్‌నర్సుల కొరత..

ఖైరతాబాద్ ఆరోగ్య కేంద్రానికి ఎక్కువగా గర్భిణులు వస్తుంటారు. చిన్నపిల్లల సమస్యలు, జనరల్ సమస్యలతో కొందరు వస్తుంటారు. 50 పడకల సామర్థ్యంతో ఉన్న ఆస్పత్రిలో స్పెషలిస్టు సివిల్ సర్జన్లు నలుగురు ఉండాల్సి ఉండగా, ఇద్దరు మాత్రమే ఉన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు 11 మంది అవసరం ఉండగా, కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. అందులో ఇద్దరు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. డిప్యూటీ సివిల్ సర్జన్లు ఆరుగురు అవసరం ఉండగా, ఒక్కరు మాత్రమే ఉన్నారు. అదీ డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తున్నారు. ఇక ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్‌లు ఒక్కరూ లేకపోవడం విశేషం. స్టాఫ్‌నర్సులు 26 మంది అవసరం ఉండగా, కేవలం 15 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా 10 మందిని ఇతర ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై పంపారు. పనిచేస్తున్న డాక్టర్లు మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించి వెళ్తున్నారు. అనంతరం ఆస్పత్రికి పేషంట్లు వస్తే డాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడించి మందులు ఇస్తున్నారు. ఇక ఎమర్జెన్సీ పరిస్థితిలో ఎవరు వచ్చినా ఇతర ప్రభుత్వాస్పత్రులకు పం పుతున్నారు. సరిపడా సిబ్బంది లేక అడ్మిట్ అయిన పేషంట్లు చాలామంది రాత్రి సమయాల్లో ఇళ్లకు వెళ్లి ఉదయం వచ్చి బెడ్‌పై పడుకుంటున్నారు.

పేరుకే ప్రభుత్వాస్పత్రి..

స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో దాదాపు రూ.11 కోట్ల నిధులతో నాలుగు అంతస్థుల భవనంలో 50 పడకల ఆస్పత్రిని నిర్మించారు. నిర్మాణం పూర్తయిన చాలా సంవత్సరాలకు ఇక్కడ వసతులు, సిబ్బందిని నియమించారు. దీని నిర్వహణను అటు ఆరోగ్యశాఖ గాని, ఇటు ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడంలేదు. ఆస్పత్రిని మోడల్ హెల్త్ సెంటర్‌గా చేస్తామని, ట్రామా కేర్ వసతులతో పాటు ఎమర్జెన్సీలో పేషంట్లకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పినా అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. కనీసం సరిపడా డాక్టర్లు, నర్సులు లేకుండా ఉంటే ఎలా నడుస్తుందని పలువురు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి రోజూ 200 నుంచి 300 వరకు ఓపీ పేషంట్లు వచ్చే ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కనీసం రక్షిత మంచినీటి సౌకర్యం కూడా లేదు. మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని దాతలను ఆస్పత్రి సూపరింటెండెంట్ కోరుతున్నారు. ఇక్కడున్న లిఫ్ట్ తరచూ పాడవుతుండడం, సరిపడా శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో ఆస్పత్రి ఏర్పాటు చేసిన అసలు ఉద్దేశ్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా వైద్యారోగ్య శాఖ, ప్రజాప్రతినిధులు ఆస్పత్రిలో సరిపడా వైద్యులు, నర్సులు, శానిటేషన్ సిబ్బందిని నియమించి అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చి 24 గంటలపాటు వైద్యం అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రెండుసార్లు సిబ్బంది కోసం విన్నవించాం..



ఆస్పత్రిలో సిబ్బంది సరిపడా లేకపోవడం వల్ల 24 గంటలపాటు వైద్య సేవలందించడంలో ఇబ్బందులు వస్తున్నాయి. వైద్యుల కొరతపై జిల్లా వైద్యాధికారికి నివేదిక ఇచ్చాం. ఆస్పత్రిలో మినరల్ వాటర్ కోసం ఆర్‌వో ప్లాంట్ అవసరం ఉంది. దాతలు ముందుకు వస్తే ఏర్పాటు చేస్తాం. దాని నిర్వహణ బాధ్యత మాదే. త్వరలో వైద్యులు, నర్సులు వస్తారని ఆశిస్తున్నా.

- డాక్టర్ కె.రాజశేఖర్, సూపరింటెండెంట్, ఖైరతాబాద్ ఆరోగ్య కేంద్రం



సుధాకర్‌కు బీ ఫామ్ అందజేస్తున్న కేబీ శ్రీధర్, చెన్నారెడ్డి

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నాదెండ్ల

ఎర్రగడ్డ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరఫున జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేస్తున్న ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాదెండ్ల సుధాకర్‌కు పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి ఎర్రగడ్డలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం బీ ఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి పార్టీ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేహెచ్‌ఎస్ శర్మ, కోశాధికారి గూడూరి విజయలక్ష్మి, ఉమెన్ సెల్ ఛైర్మన్ శోభారెడ్డి, జాతీయ ఉపాధ్యక్షుడు దశరథం, నాయకులు శ్రీవాసుదేవ్, సెల్వరాజ్, అంజనీ దేవి, వెంకటేష్‌గుప్తా పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు స్నేహితులు, అభిమానులతో కలిసి బోరబండ నుంచి ర్యాలీగా వెళ్తున్న జీవన్ కుమార్

● బోరబండ, ఆంధ్రజ్యోతి

గోపీనాథ్ సేవలను విస్మరించవద్దు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

బోరబండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా మాగంటి గోపీనాథ్ చేసిన సేవలను ప్రజలు విస్మరించవద్దని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌తో కలిసి బోరబండ డివిజన్ బంజారా నగర్, స్వరాజ్ నగర్‌లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. గోపన్న చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి సునీతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాగంటి తనయుడు వాత్సల్యనాథ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, దేవమణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతగోపీనాథ్‌తో కలిసి బోరబండలో ప్రచారం చేస్తున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

వెంగళరావునగర్‌లో..

వెంగళరావునగర్ డివిజన్ పరిధిలో మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి ఆయన మట్టి పనిచేసి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



ఖైరతాబాద్ సదర్ ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

సీఎంకు ఖైరతాబాద్ సదర్ ఆహ్వానం

ఖైరతాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి మరుసటి రోజున యాదవులు జరిపే సదర్ ఉత్సవాలకు ఖైరతాబాద్ నిర్వాహకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. గురువారం నిర్వాహకుడు చౌదరి సత్తయ్య యాదవ్ కుటుంబీకులు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి ఆధ్వర్యంలో సీఎంను కలిశారు. ఈనెల 21న ఖైరతాబాద్‌లో జరిగే సదర్ ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో చౌదరి కుటుంబీకులు మంగళారాపు రాజు యాదవ్, మహేష్ యాదవ్, మధుకర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మల్లికార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఎర్రగడ్డలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, పక్కన అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి

ఎర్రగడ్డ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎర్రగడ్డలోని బీజేపీ కార్యాలయంలో బూత్ కమిటీ అధ్యక్షులు, కో-ఆర్డినేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రాన్ని మజ్లిస్ పార్టీ పాలిస్తున్నదని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిర్ణయించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. అనంతరం సారథినగర్, కళ్యాణ్‌నగర్ వెంచర్-3లో పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, నాయకులు సారంగపాణి, ఎర్రబెల్లి ప్రదీప్, డాక్టర్ చేకూరు హనుమంతు నాయుడు, ప్రేమ్ కుమార్, శిల్పారెడ్డి, ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు బొట్టు విజయ కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు ఏర్పాట్లు చేయండి

చార్మినార్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భాగ్యలక్ష్మి ఆలయంలో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జరిగే దీపావళి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరితకు ఆలయ ట్రస్టీ సూర్యప్రకాష్, సచిన్, ప్యారసాని వెంకటేష్ వినతిపత్రం ఇచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తామని సరిత హామీ ఇచ్చారన్నారు.



సరితకు వినతిపత్రం ఇస్తున్న భాగ్యలక్ష్మి ఆలయం ట్రస్టీ సూర్యప్రకాష్

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు

● కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... జర్నలిస్టు కాలనీలోని 371 గజాల స్థలంలోకి భవాని శంకర్ అనే కాంట్రాక్టర్ అక్రమంగా ప్రవేశించడమే కాకుండా, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఎన్నిసార్లు హెచ్చరించినా వినిపించుకోకుండా సెలవు దినాల్లో పనులు చేస్తున్నారని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్.403లోని 371 గజాల ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మించడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు భవానీ శంకర్‌పై బీఎన్‌ఎస్ సెక్షన్ 329(3), 324(3) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బేగంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన గుర్తు తెలియని యువకుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బేగంపేటలోని ఓ కాలనీకి చెందిన విద్యార్థిని బంజారాహిల్స్‌లోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతుంది. ఈనెల 10వ తేదీన పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వస్తుండగా, గుర్తు తెలియని యువకుడు బాలికను బైక్‌పై వెంబడించాడు. అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక కేకలు వేయగా పారిపోయాడు. జరిగిన విషయాన్ని బాధితురాలు కుటుంబసభ్యులకు చెప్పగా వారు షీ టీమ్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కాలనీ అసోసియేషన్ సభ్యులు, బాలిక కుటుంబసభ్యులతో కలిసి గురువారం బేగంపేట పోలీసులను ఆశ్రయించగా వారు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెంపుడు కుక్క యజమానురాలిపై..

బంజారాహిల్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెంపుడు కుక్క యజమానురాలిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్.72లోని వీధి నెంబర్.5లో నివసించే శ్రీలక్ష్మి రాత్రి 7 గంటల ప్రాంతంలో తన పెంపుడు కుక్కతో బయటకు వచ్చి వాకింగ్ చేస్తుంది. అదే సమయంలో అదే వీధిలోని ఓ ఇంటికి కాపలాగా ఉండేందుకు వస్తున్న శైలేష్ చేతులు, కాళ్లపై కుక్క కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో శైలేష్ తనను కుక్క కరవడానికి యజమానురాలి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దాడి చేసిన కుక్కను బ్లూ క్రాస్ సొసైటీకి అప్పగించారు. యజమానురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై..

అమీర్‌పేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరిట మోసం చేయడంతోపాటు పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన వ్యక్తిపై ఎస్‌ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్ నగర్ ప్రాంతంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న యువతి(30) కారు డ్రైవర్. ఈ ఏడాది జూలైలో ఓ యాప్ ద్వారా కిరణ్‌తేజ్ పరిచయమయ్యాడు. తరచూ కలుసుకుంటున్న వీరి మధ్య స్నేహం ప్రేమగా మారింది. యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ మేరకు ఎస్‌ఆర్ నగర్‌లోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి లైంగికంగా వాడుకున్నాడు. తర్వాత కూడా పలుమార్లు కలిశాడు. అలాగే, యువతి స్వగ్రామానికి వెళ్లి అక్కడ కొన్ని రోజులు కలిసి ఉన్నారు. ఆ తర్వాత నగరానికి వచ్చిన యువతికి కిరణ్‌తేజ్ దూరంగా ఉండసాగాడు. పెళ్లి మాటెత్తేసరికి దుర్భాషలాడుతూ దాడికి యత్నించాడు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలు పేద లకు ఎంతో మేలు చేస్తాయని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం సనత్‌నగర్ బీకేగూడలో శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్టు, ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు పార్థసారథిని అభినందించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఆశీర్వాదమైందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు దానిని కొనసాగించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, ఆస్టర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సురేష్, సీనియర్ సిటిజన్లు దూబే, మానిక్‌రావు పాటిల్, అనంతరెడ్డి, నాయకులు కర్నాకర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్, ఖలీల్, అశోక్ యాదవ్, గోపీలాల్ చౌహాన్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, పీయూష్ గుప్తా, పురుషోత్తం పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని

సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్ష పదవికి నామినేషన్



ఏఐసీసీ అబ్జర్వర్ సీపీ జోషికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న డాక్టర్ కోట నీలిమ

బేగంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆమె తన నామినేషన్ పత్రాలను ఏఐసీసీ అబ్జర్వర్ సీపీ జోషికి అందజేశారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ ఏఐసీసీ పరిశీలకులు తెలంగాణలోని ప్రతీ జిల్లాలో నాయకులు, కార్యకర్తలతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలు సేకరిస్తున్నారని తెలిపారు. సీపీ జోషి మాట్లాడుతూ డీసీసీ అధ్యక్షుల ఎంపికలో కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాం గ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతృమూర్తులే పిల్లలకు తొలి గురువు

బంజారాహిల్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మాతృమూర్తులే పిల్లలకు తొలి గురువు అని సామాజిక కార్యకర్త రమారావి అన్నారు. విద్యాభారతి శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మాతృ సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు తొలి సమ్మేళనం గురువారం శ్రీనగర్‌కాలనీ కేశవనగర్ సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో జరిగింది. ముఖ్య వక్త రమాదేవి మాట్లాడుతూ ప్రతీ కుటుంబంలో మహిళ పాత్ర కీలకమైందన్నారు. తల్లిగానూ, భార్యగానూ, ఇల్లాలిగానూ అనేక రకాలుగా ఇంటిని చక్కబెట్టేది కేవలం స్త్రీ మాత్రమేనని అన్నారు. మాతృ సమ్మేళనాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి అనఘా వెంకటలక్ష్మి, సహ కార్యదర్శి బొంత కోమలి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వాణిసక్కుబాయి, తదితరులు పాల్గొన్నారు.



మాతృ సమ్మేళనంలో సామాజిక కార్యకర్త రమారావి, వాణిసక్కుబాయి తదితరులు

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చే వరకు ఉద్యమం

బర్కత్‌పుర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లపై ఏ పార్టీకి చిత్తశుద్ధి లేదని మహాజన సేన అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ ఆరోపించారు. బీసీల రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చేంత వరకు మహా ఉద్యమం చేపడతామన్నారు. అగ్రవర్ణాల చేతిలో ఉన్న వ్యవస్థలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ నెల 18న బీసీ జేఏసీ నిర్వహిస్తున్న బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపనున్నట్టు ఆయన పేర్కొన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోనితో కలిసి ఆయన మాట్లాడారు. బంద్‌కు విద్యా, కార్పొరేట్ రంగాలు సహకరించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవడం తప్పదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొచ్చి ప్రభుత్వం దానిని కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. సేన పార్టీ నాయకులు షణ్ముఖరావు, సంపత్‌కుమార్, భాగ్యమ్మ, ప్రశాంత్, అరుణ్ పాల్గొన్నారు.

'బీసీల హృదయాలను గాయపరిచిన సుప్రీంకోర్టు తీర్పు'

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే వెకేట్ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను తిరస్కరించడం బీసీల హృదయాలను గాయపరిచిందని బీసీ జేఏసీ వైస్ ఛైర్మన్ వీజీఆర్ నారగోని ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్, రాష్ట్రీయ ముస్లింమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ పాహిముద్దీన్, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి సుదమల్ల వెంకటస్వామి, బి.పురుషోత్తమ్, సయ్యద్ కరులేదర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 18న నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అన్ని పార్టీలు, కుల సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు.



గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న ఏఐఎంఐఎం నాయకుడు అజార్ తదితరులు

గ్యార్వీ ఉత్సవాలతో భక్తిభావం పెంపు

ఎర్రగడ్డ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్యార్వీ ఉత్సవాలు భక్తిభావాన్ని పెంపొందిస్తాయని ఏఐఎంఐఎం నాయకుడు మహ్మద్ అజార్ అన్నారు. గురువారం ఎర్రగడ్డలోని ఓల్డ్ పోస్టాఫీస్ ప్రాంతంలో మహ్మద్ మహబూబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యార్వీ ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో సాజిద్, ఇలియాస్, బాబు, రషీద్, మెహరాజ్, ఖదీర్, కిరణ్, అఫ్జల్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హేమలత

హోమ్ సైన్స్ కళాశాలలో ఆరోగ్య దినోత్సవం

ఖైరతాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారం ఇవ్వకపోతే ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదమున్నదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ హేమలత అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైఫాబాద్‌లోని హోమ్ సైన్స్ కళాశాలలో 'మెరుగైన ఆరోగ్యం.. మెరుగైన భవిష్యత్తు కోసం చేతులు కలుపుదాం' అనే అంశంపై కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రబంద్‌కు సంఘాల మద్దతు

తార్నాక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) సంపూర్ణ మద్దతు ఇస్తోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. గాలి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని గురువారం తార్నాకలోని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో ఆయన్ను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో ఎక్కడా 50 శాతం రిజర్వేషన్లకు మించి ఉండరాదని నిబంధన లేనప్పటికీ హైకోర్టు స్టే ఇవ్వడం, సుప్రీంకోర్టు సమర్థించడం సహేతుకం కాదన్నారు. సామాజిక న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉన్నత న్యాయస్థానాలు తీర్పులు ఇవ్వడం బాధాకరమని, ప్రజాకోర్టులోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. బీసీ జేఏసీ నిర్వహించనున్న రాష్ట్రబంద్‌లో ఆర్‌పీఐ మద్దతు ఇస్తోందన్నారు. అనంతరం బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ల అమలు కేవలం స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రమే కాకుండా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్‌ల అమలు కోసం రాజ్యాంగ సవరణ జరగాలని, అందుకు తెలంగాణ ఉద్యమం తరహా ప్రజాపోరాటం నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ఇన్‌చార్జి డాక్టర్ మేజర్ చంద్రకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు పల్లేర్ల మైసయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తొంట బాబు, డీజేఏసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోయ శంకర్, ముస్లీం వింగ్ యూత్ జనరల్ సెక్రటరీ షహబాజ్ తదితరులు పాల్గొన్నారు.


తార్నాక: అభివాదం చేస్తున్న బీసీ జేఏసీ వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని, ఆర్‌పీఐ నాయకులు

గంగపుత్ర సంఘం కూడా



బౌద్ధనగర్: సమావేశంలో రాష్ట్రగంగపుత్ర సంఘ నాయకులు

బౌద్ధనగర్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): బీసీల 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు మద్దతుగా నిర్వహించనున్న రాష్ట్రబంద్‌కు తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం పూర్తి మద్దతు ఇస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేశబోయిన రఘు తెలిపారు. గురువారం బౌద్ధనగర్‌లో నిర్వహించిన సమావేశంలో గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎంపీ రాహుల్‌గాంధీ కామారెడ్డి డిక్లరేషన్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. రిజర్వేషన్ లు కల్పిస్తూ అసెంబ్లీ బిల్లు పెట్టి మాట నిలబెట్టుకున్నారన్నారు. దీనికి ప్రతిపక్షాలు మద్దతు ప్రకటించాయన్నారు. దీంతో కొంతమంది హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చిందన్నారు. దీనికిగాను నిరసిస్తూ బీసీ జేఏసీ రాష్ట్రబంద్‌కు పిలుపు ఇవ్వగా తాము పూర్తి సహకారం అందిస్తామన్నారు. గంగపుత్ర సంఘం అనుబంధ కమిటీలు, రాష్ట్రకమిటీలు, జిల్లా కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కర్మకొండ యాదగిరి, జాతీయ మత్యకార సంఘం తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు ఏ.ఉదయ్‌కిరణ్, నాయకులు డి.సదానంద్, వి.సుధాకర్, అంబటి రమేష్ పాల్గొన్నారు.

● ఉత్తమ సేవలకు దక్కిన గౌరవం



గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి.. అవార్డు అందుకున్నారు. హైబిజ్ టీవీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో అవార్డ్స్ 2025 ప్రదానోత్సవంలో భాగంగా వైద్యరంగంలో ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు గాను ఆమెకు గురువారం పురస్కారం అందజేశారు. ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ విచ్చేసి తన చేతుల మీదుగా అవార్డు అందజేశారు. (అడ్డగుట్ట - ఆంధ్రజ్యోతి)

● ప్రత్యేక పూజలు



అశ్లేష్ నక్షత్రం పురస్కరించుకుని గురువారం మెట్టుగూడ అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో లష్కర్ జిల్లా సాధనసమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు రవి, కృష్ణప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు మిట్టపల్లి బాబురావు, రవీంద్రసాగర్, అశ్విన్, అశోక్ గురుస్వామి తదితరులు కూడా హాజరయ్యారు. -బౌద్ధనగర్, (ఆంధ్రజ్యోతి)


పిల్లలతో నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

● డీసీపీ రష్మి పెరమాళ్

అడ్డగుట్ట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా గురువారం సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ ఎదురుగా ఉన్న స్వీకార్ ఉపకార్ బుద్ధిమాంద్య కేంద్రాన్ని సందర్శించారు. కాసేపు పిల్లలతో సరదాగా గడిపారు పండ్లు, బిస్కెట్లు ఇతర తినుబండారాలను అందజేశారు. బుద్ధిమాంద్య పిల్లలకు స్వీకార్ ఉపకార్ సంస్థ ప్రతినిధుల అందిస్తున్న సేవలను కొనియాడారు. చిన్నారుల ఆహార విషయంలో ప్రత్యేకశద్ధ తీసుకోవాలన్నారు. మారేడుపల్లి పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


త్రోబాల్ అందిస్తున్న వైద్యులు, అధ్యాపకులు

ఉత్సాహపరిచిన మహిళల త్రోబాల్

అడ్డగుట్ట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గాంధీ మెడికల్ ఆవిర్భావం దినోత్సవంలో భాగంగా గాంధీ మెడికల్ కాలేజీలో గురువారం మహిళల త్రోబాల్ మ్యాచ్ దివ్య టీం, అలేక్యా టీంల మధ్య జరిగింది. ఇందులో ఆలేక్యా టీం టాస్ గెలిచింది. ఆ తర్వాత జరిగిన పోటీలో భారీ పాయింట్లతో విజేతగా నిలిచింది. శ్రేయా అశ్విని, ఆలేక్యా దివ్య సత్తా చాటారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, గాంధీ మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవి శేఖర్, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ కిరణ్ మాదల, ఫిజికల్ డైరెక్టర్ వేణు, డాక్టర్ లెనిన్, డాక్టర్ అపూర్వ రెడ్డిలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

● రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ డిమాండ్
● కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఆవరణలో ధర్నా



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ సభ్యులు

సికింద్రాబాద్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పేరిట రాజీవ్ రహదారిని 200 అడుగుల మేరకు విస్తరించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, 100 అడుగుల మేరకు కుదించాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం ఆవరణలో ధర్నా చేశారు. ఓపెన్ మార్కెట్ ప్రకారం ఐదు రెట్లు నష్ట పరిహారం న్యాయబద్ధంగా ఇవ్వాలని, 100 శాతం పెంచిన ఇంటి పన్నును వెంటనే రద్దు చేయాలన్నారు. ఆస్తినష్టం జరుగుతున్న ప్రతీకుటుంబానికి, వాణిజ్య సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేష్‌లకు వినతి పత్రాలు సమర్పించారు. జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్‌గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత తప్పనిసరి



● స్కూల్, కాలేజీల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
● ఆంధ్రజ్యోతితో సీఐ మధుకుమార్

అడ్డగుట్ట, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): "ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఏపీకే ఫైల్స్, ఇతర లింకులు మొబైల్స్‌కు పంపితే తెరవకూడదు. గుర్తు తెలియని వ్యక్తులు ఆఫర్స్ డిస్కౌంట్ అంటే నమ్మొద్దు.. వెంటనే సైబర్ క్రైంకు సమాచారం ఇవ్వాలి అని" గోపాలపురం సీఐ మధుకుమార్ తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు. "ప్రస్తుత పరిస్థితిలో సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. ఈ విషయంలో ప్రతీఒక్కరు జాగ్రత్తగా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వవద్దు. ఒక వేళ ఇస్తే గుర్తు తెలియని వ్యక్తుల కాల్స్ ఎత్త వద్దని చెప్పాలి. పొరబాటున ఆగంతకులు ఫోన్ చేసి ఓటీపీ వస్తుంది. తమకు లాటరీ తగిలిందని చెబితే పిల్లలు డబ్బు వస్తుందని ఆశతో దాన్ని చెబుతుంటారు. వెంటనే ఖాతాల్లో ఉన్న నగదు పోగొట్టుకుంటారు. ఈ తరహా మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. నార్త్‌జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లో ఉన్న ప్రతీ స్కూల్, కాలేజీలో ఆన్‌లైన్ మోసాల నివారణ పట్ల అవగాహన కల్పిస్తున్నాం. మేము చేస్తున్న కృషిలో కొంతమంది పిల్లల్లో అవగాహన వస్తే సంతోషమే అని" సీఐ మధుకుమార్ తెలిపారు.

కార్యకర్తల అభిప్రాయంతోనే డీసీసీ అధ్యక్షుడి ఎంపిక


మాట్లాడుతున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం కంటోన్మెంట్ నియోజకవర్గం ఏ బ్లాక్, బీ బ్లాక్ సమావేశాలు గురువారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఏ బ్లాక్.. 2, 3, 4, 5 వార్డులు, మోండా (150) డివిజన్ల సమావేశం బొలంరాయిలో ఉన్న లీప్యాలెస్ క్రౌన్ విల్లా గార్డెన్స్‌లో, బీ బ్లాక్.. 1, 6, 7, 8 వార్డుల సమావేశం తిరుమలగిరి జయలక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఏఐసీసీ పరిశీలకులు సీపీ జోషి, టీపీసీసీ పరిశీలకులు నారాయణపేట్ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ దుద్దిళ్ల శ్రీనివాస్‌బాబు నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం జోషి, ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ఈ దేశానికి స్వాతంత్రం తీసుకు వచ్చింది కాంగ్రెస్ అని, తెలంగాణను కూడా ఇచ్చింది తమ పార్టీయేనని అన్నారు. సమాచార హక్కు చట్టాన్ని తీసుకువచ్చి ప్రజలను చైతన్యవంతం చేసింది కూడా హస్తం పార్టీయేనని గుర్తు చేశారు. ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పార్టీలో కార్యకర్తల అభిప్రాయానికి ఎనలేని ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండే వారిని పదవులలో నియమించాలని చెప్పారన్నారు. అందరి ఆమోదం మేరకు డీసీసీ అధ్యక్షుడి ఎంపిక నిర్వహిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, ఏ బ్లాక్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అనస్థీషియా దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న వైద్యులు

అడ్డగుట్ట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గాంధీ మెడికల్ కాలేజీలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర ఆధ్వర్యంలో ప్రపంచ అనస్థీషియా దినోత్సవ సందర్భంగా గురువారం వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం కాలేజీ మెడికల్ ఎగ్జామ్స్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచిన డాక్టర్ ఎస్. కావ్యకు డాక్టర్ మేజర్ ఎంవీ భీమేశ్వర్ తన చేతుల మీదుగా బంగారు పతకం అందజేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ భీమేశ్వర్, సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, ఈఎన్‌టీ విభాగాధిపతి ప్రొఫెసర్ భూపతి రాథోడ్, అనస్థీషియా విభాగాధిపతి ప్రొఫెసర్ మురళీధర్‌లతో పాటు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.


రాజశేఖర్ మృతదేహం

రైలు ఢీకొని యువకుడి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సంజీవయ్య పార్కు సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు.. తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట్ పాటిగడ్డ ప్రాంతానికి చెందిన కావలి రాజశేఖర్ (32) ఈనెల 12న భార్య అనారోగ్యంతో మృతిచెందింది. అప్పటి నుంచి తాగుడికి బానిసైన అతను బుధవారం సంజీవయ్య పార్కు సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆలయ హుండీ లెక్కింపు

బోయినపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాడ్‌బంద్ వీరాంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని గురువారం నిర్వహించారు. ఈఓ ఏ నరేందర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, బోయినపల్లి పోలీస్ డిపార్ట్‌మెంట్ వారి పర్యవేక్షణలో సీసీ కెమెరాల మధ్యలో దేవస్థానం హుండీలు లెక్కింపు చేశారు. ఇందులో కరెన్సీ రూ. 15 లక్షల 6 వేల 653లు, నాణేలు రూ. 1,13,703 మొత్తం రూ.16 లక్షల 20 వేల 356లతో పాటు నాలుగు యూఎస్ డాలర్‌లు వచ్చాయని ఆలయ ఈఓ నరేందర్ వెల్లడించారు.

డీసీసీ అధ్యక్ష పదవికి నామినేషన్

బేగంపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆమె తన నామినేషన్ పత్రాలను ఏఐసీసీ అబ్జర్వర్ సీపీ జోషికి అందజేశారు.



నిందితులను విలేకరులకు చూపుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నరసయ్య తదితరులు, స్వాధీనం చేసుకున్న కార్లు

కార్ల యజమానులకు బురిడీ

● కిరాయికని తీసుకెళ్లి వాహనాల అమ్మకం
● ఇద్దరి అరెస్టు, ఏడు వెహికిల్స్ స్వాధీనం
● ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

బౌద్ధనగర్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): నెలనెలా అద్దె ఇస్తామంటూ కార్ల యాజమానులకు బురిడీ వేశాడు. అద్దె కాదు కదా! తీసుకున్న వాహనాలనే అమ్మేశాడు ప్రబుద్ధుడు. అమ్మిన, కొన్న ఇద్దరినీ చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి ఏడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న మరొకడు పరారీలో ఉన్నాడు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ బి.బాలస్వామి, అడిషనల్ డీసీపీ నరసయ్య, చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌లతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. నామాలగుండు ఉప్పరబస్తీ ప్రాంతానికి చెందిన సంగిశెట్టి ప్రవీణ్‌కుమార్(44) నగరంలో ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్. అతను కొన్ని కార్లను అద్దెకు తీసుకున్నాడు. ఐదు సీటర్ల కార్లకు నెలకు రూ.20 వేలు, ఏడు సీటర్ల కార్లకు నెలకు రూ. 25 వేలు కిరాయి చెల్లిస్తానని ఒప్పుకున్నాడు. రెండు నెలల పాటు సవ్యంగా చెల్లించాడు. తర్వాత నుంచి ఎగ్గొట్టి తిరుగుతున్నాడు. ఈనెల 5న కారును అద్దెకు తీసుకుని డబ్బులు చెల్లించటం లేదని ప్రవీణ్‌కుమార్‌పై చిలకలగూడకు చెందిన కారు యాజమాని ఎస్.జ్ఞానేశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మరికొంతమంది వద్ద కూడా ఇదే విధంగా కార్లను అద్దెకు తీసుకుని డబ్బులు చెల్లించటం లేదనే విషయం దర్యాప్తులో తేలింది. అలాగే వాటిని కొనుగోలుదారులు ఎండీ రిజ్వాన్, జి.అమరేందర్‌కు విక్రయించి, 9 లక్షల 10వేల రూపాయలను ఇప్పటికే తీసుకున్నట్లు స్పష్టమైంది. గురువారం నిందితుడితో పాటు అమరేందర్‌ను చిలకలగూడ చౌరస్తాలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు రిజ్వాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును చాకచాక్యంగా ఛేదించిన ఎస్సైలను, సిబ్బందిని అభినందించి రివార్డులను అందజేశారు. సమావేశంలో అడ్మిన్ ఎస్సై రవికుమార్, ఎస్సై ఆంజనేయులు పాల్గొన్నారు.